# ఇల్లాలు

**తన అందమే తనను గొప్పదాన్ని చేస్తుందని ఆమె నమ్మకం. తను కోరుకున్నవన్నీ ఉన్న ఇంజనీరుకు భార్య అయింది. ఆమె సౌందర్యం ఆమెను నిజమైన 'ఇల్లాల్ని' చేయగలిగిందా?**

## వసుంధర

చిన్నప్పట్నించీ నాకు కులాసాగా బ్రతకాలని ఉండేది. అయితే అమ్మానాన్నలకు అయిదుగురు పిల్లలు. మొదటి నలుగురూ ఆడపిల్లలు. నేను నాలుగో దాన్ని. మాఇంట్లో అంతా అయిదోవాడైన తమ్ముణ్ణే ముద్దుచేసేవారు. చిన్నప్పట్నించీ వాడంటే నాకు అసూయే!

తమ్ముణ్ణెక్కువ ముద్దు చేస్తుందని అమ్మంటే నాకు కోపంగా ఉండేది. నాన్నన్నా కోపమే కానీ ఆయన చాలా అందంగా ఉంటాడు. ఆ అందమే నాకు వచ్చింది. ఆడపిల్లను కావడంవల్ల నేను ఆయనకంటే అందంగా ఉంటాను.

నా అందం నన్ను గొప్పదాన్నిచేస్తుందని నా నమ్మకం. చిన్నప్పట్నించీ నేను నా అందానికి మెరుగులు దిద్దుతూండేదాన్ని చదువుకునేరోజుల్లో పుస్తకం ముందుకంటే అద్దంముందే ఎక్కువ గడిపేదాన్ని. ఇంట్లో అంతా నన్ను 'షోకిల్లారాణీ అని' తిట్టేవారు. ఏ పనీ ముట్టుకోదని కసిరేవారు. పరిస్థితులు తెలిసి మసలుకోదని బాధ పడేవారు.

నేను పట్టించుకునే దాన్ని కాదు. ఇతరుల గురించి క్షణం ఆలోచించానంటే చాలు, నా ప్రతి చిన్న అవసరాన్నీ త్యాగం చేయాలి. సాగక పోవడంవల్ల తప్ప నా అంతట నేను చిన్న త్యాగం కూడా చేయలేదు.

అందం మీద నాకున్న నమ్మకం వమ్ము కాలేదు. నా ముగ్గు రక్కలకూ గంతకు తగ్గ బొంత గుమస్తా సంబంధాలే వస్తే! నాకు ఇంజనీరు సంబంధం వచ్చింది. ఆయన కాస్త నల్లగా ఉంటాడు. కానీ తల్లిదండ్రులకు ఒక్కగా నొక్క కొడుకు. ఉద్యోగరీత్యా వేరే ఉంటున్నాడు. రెండు చేతులా సంపాదిస్తున్నాడు. అన్నింటికీ మించి కానీ కట్నం తీసుకోలేదు.

ఇలాంటి అవకాశం కోసం ఎదురు చూస్తున్నాను. నేను మనస్పూర్తిగా ఇష్టపడి ఈ సంబంధం చేసుకున్నాను. కాపురానికి వెళ్ళే ముందు అమ్మ నన్ను హెచ్చరించింది, "ఇక్కడున్నట్లు నీ గురించే బ్రతక్కు. అతగాణ్ణి బాగా చూసుకో, సంతోషపెట్టు. నీకు జీవితం బాగుంటుంది."!

ఒకరికోసం బ్రతకడం నా వల్లకాదు. అందుకే అమ్మ సలహా నాకునచ్చలేదు. అయినా కాపురానికి వెడుతూంటే నాకు కళ్ళనీళ్ళు రాలేదు. ఒక మురికి కూపంలోంచి బయటపడి నా ఇంటికి నేను వెడుతున్నా ననిపించింది.

ఆయన పేరు సుధాకర్. నేను ముద్దుగా 'సుధా' అని పిలిచేదాన్ని. నేనేం చేసినాపరవశించి పోయే వాడు. నన్ను చూస్తేనే ఆయనకు మహాసంతోషంగా ఉండేది. అందు క్కారణం నా అందమేనని రోజూ దానికి మరిన్ని మెరుగులు దిద్దేదాన్ని.

అలా ఒక ఏడాది గడిచింది. ఆ ఏడాది నాకు కలలా అనిపించింది.

పెద్ద ఇల్లు. ఫర్నిచరు బాగా ఉంది. వంటవాడు, పని మనిషి, తోటమాలి ఉన్నారు. ఎప్పుడైనా అత్తమామలు వచ్చినా రెండు మూడు రోజులు మించి ఉండరు. ఏ కలతలూ లేని స్వేచ్ఛా జీవితం!

అబద్ధమెందుకూ, ఈ జీవితంలో మునిగి నేను నా వాళ్ళను పూర్తిగా మరిచిపోయాను. వాళ్ళు నాకుత్తరం వ్రాసినా బదు లిచ్చేదాన్ని కాదు. బదులిస్తే వాళ్ళు మళ్ళీ జవాబు వెంటనే రాస్తారు. వాళ్ళ ఉత్తరం చూస్తే వాళ్ళు, అక్కడ నేను గడిపిన జీవితం గుర్తు కొస్తాయి. అంత తరచుగా వాళ్ళను గుర్తు చేసుకోవడం నాకు నచ్చదు.

ఏడాది గడిచాక ఆయన నాతో, "మా అమ్మ నాయనమ్మ కావాలని ఉబలాట పడుతోంది" అన్నాడు.

పిల్లల్ని కనడం నా కిష్టం లేదు. అందం పోతుందని నా భయం. అయితే పిల్లలకోసమే ఆయన నన్ను పెళ్ళి చేసుకున్నారని అర్థ మయాక ఆ విషయం ఆయనకు చెప్పలేదు. అదీకాక భార్యభర్తల అనుబంధాన్ని పిల్లలే శాశ్వతం చేస్తారుట. బయటి పిల్లల్ని పెంచుకుంటే మమతానురాగాలు బలపడవు. అసలు పిల్లలే లేకుంటే భార్యాభర్తలు విడిపోవచ్చుకూడా!

ఆడదానికి వయసు మీదపడ్డ కొద్దీ పురుడు కష్టమవుతుందిట. అందుకని నాకు ఇష్టం లేకపోయినా ఇరవైనాలుగవఏట బిడ్డతల్లి నయ్యాను.

నా కొడుకు బొద్దుగా, ముద్దుగా ఎంతో బాగుంటాడు. వాణ్ణి చూస్తే నాకు సంతోషమేగానీ, బిడ్డతల్లిగా బ్రతకాలని నాకు లేదు. సొసైటీలో మంచి గుర్తింపుతో గొప్పగా బ్రతకాలని నా కోరిక. అందుకే ముందు నేను నాలోని తల్లిని బయటకు రానివ్వక బిడ్డ కు పాలు కూడా ఇవ్వకూడదని నిర్ణయించుకున్నాను. బిడ్డ పోషణకు ఆయాను నియమించాను.

ఆయా పేరు విమల. మాకు దూరపు బంధువు. బాల వితంతువు. అన్నింటికీ మించి నాకు నచ్చిన దేమిటంటే ఆమె అందంలో నా కాలి గోటికి పోలదు. నా వయసు పిల్లను నా ఇంటికి ఆయాగా తెచ్చినపుడు ఆ మాత్రం జాగ్రత్త తీసుకోవాలని నాకు తెలుసు.

విమలను ఆయాగా ఇంటికి తెచ్చినందుకు అమ్మ నన్ను దెబ్బలాడి, "చేజేతులా నీ సంసారంలో నిప్పులు పోసుకుంటున్నా"వంది. నేను చెవిని పెట్టలేదు.

విమల మా ఇంటికి వచ్చిన రెండు మాసాలకు సుధాకర్ నాతో ఏకాంతంలో తన అసంతృప్తిని వెలిబుచ్చాడు.

"ఈ ఇల్లు నీది. నేను నీ వాణ్ణి. నేను, నువ్వు మనబిడ్డ - ఇదే మన ప్రపంచమైతే అది సంసారం. నాకు నువ్వంటే ఎంతో ఇష్టం. ఏరికోరి నిన్ను పెళ్ళి చేసుకున్నాను. ఈ ఇంటిని కుటుంబంగా మార్చుతావని ఆశ పడ్డాను. కానీ నువ్వు దీన్ని హొటలుగా చేశావు. ఇక్కడ భోజనం, వసతి, సుఖం దొరుకుతున్నాయి. నాకు అది చాలదు. నువ్వు నన్ను ఆలంబనగా తీసుకున్నావు. ఆప్యాయంగా పెనవేసుకుంటేనే నాకు సంతోషం. నేను చెప్పకుండా నీలో మార్పు వస్తే బాగుండేది. బిడ్డ పుడితే మారతా వనుకున్నాను. కానీ ఇంటికి ఆయాను తెచ్చావు. నీ భర్తకు గృహిణి కావాలి, నీ బిడ్డకు తల్లి కావాలి. ఆ రెండూ నువ్వే కావాలి" అన్నా డాయన.

నేను కోప్పడకుండా "నన్ను వంటింటి కుందేలుగా మార్చి నాలుగు గోడల మధ్య బంధించవ"ద్దని బ్రతిమాలుతూ చెప్పాను.

"నీలో కళలు ఉంటే కళాకారిణివి కావచ్చు. సమర్థత ఉంటే రాజకీయ నాయకురాలివి కావచ్చు. ఆశయ ముంటే సంఘసేవికవు కావచ్చు. నే నభ్యంతర పెట్టను. నీ ఖాళీ సమయాన్ని క్లబ్బుల్లో, మీటింగుల్లో వృథా చేయక గృహిణివి కమ్మని నా అభ్యర్థన" అన్నా డాయన.

సుధాకర్ మంచి .డు. అంతకుమించి నాకు చెప్పలేదు. అందు కే నతడితో వాదించలేదు. నాకే జీవితం బాగుండే నేను చూసుకోవాలి. ఒకరు

శాసిస్తే నా స్వేచ్ఛ పోయినట్లే!

విమల వచ్చాక క్రమంగా ఇంట్లో మార్పులు రాసాగాయి. తోటమాలి తోటను శ్రద్ధగా పెంచుతున్నాడు. వంటవాడు రుచిగా వంటలు చేస్తున్నాడు. ఇంట్లో అందరి అవసరాలూ లోటు లేకుండా గడిచిపోతున్నాయి.

బాబుకు సంబంధించి కష్టమైనవీ, క్లిష్టమైనవీ, అసహ్యకరమైనవీ అయిన పనులు విమలే చూసుకుంటుంది. ఆమె అలంకరించి ఇస్తే ఓ బొమ్మతో ఆడుకున్నట్లు నేను వాడితో ఆడుకుంటున్నాను. బాబు తెలివి, చిలిపి చేష్టలు చూస్తూంటే నాకెంతో గర్వంగా ఉంటుంది.


రోజులు గడుస్తున్నాయి. ఇప్పుడు సుధాకర్ కూడా విమలను మెచ్చుకుంటున్నాడు. విమలను ఇంట్లో చేర్చినందుకు నన్నభినందిస్తున్నాడు. ప్రతి చిన్న అవసరానికీ "విమలా" అని పిలుస్తూంటాడు. సాధారణంగా విమల అలా పిలిపించుకునే అవకాశమే ఇవ్వదు. ముందుగానే అన్నీ సమకూర్చుతుంది.

అలా మూడేళ్ళుగడిచాయి.

ఒకరోజున వంటవాడు నూనె దాస్తూంటే విమల పట్టుకుని, "నాకు అనుమానం వచ్చింది కానీ నమ్మకస్తుడివి కదా అని నిన్నేమీ అనలేదు. నూనె ఖర్చు పెరగడానికి దన్నమాట కారణం. ఎన్నాళ్ళ నుంచి చేస్తున్నా వీ పని?" అని నిలదీసింది.

వంటవాడు తరుముకోకుండా, "మూడేళ్ళనుంచి అయ్యగారితో రంకు చేస్తూ దాచావు. నీ తెలివి నా కెక్కడిది? మొదటిసారే పట్టుబడిపోయాను" అన్నాడు.

ఈ సంభాషణ నేను విన్నట్లు వాళ్ళిద్దరికీ



తెలియదు. కానీ నా మనను చివుక్కుమంది. నా భర్త నా అంత అందగత్తె ఉండగా విమలను చేరదీస్తున్నాడా? ఇది నమ్మశక్యమా?

ఆహంకారం నాలో అనుమానానికి తావు లేకుండా చేసింది. ఇప్పుడు అనుమానం నా అహాన్ని దెబ్బతీసింది.

ఇంటి దొంగని ఈశ్వరుడైనా పట్ట లేడంటారు. కానీ ఇల్లాలిని నేను పట్టలేనా?

ఒకరోజు రహస్యంగా మాటు వేశాను. దొంగలు దొరికి పోయారు.

ముందు నేను షాక్ తిన్నాను.

విమల, సుధాకర్ ఒకరిఒడిలో ఒకరు...భరించలేని కాంక్షతో ఒకరి నొకరు చూసుకుంటూ...నన్ను చూసి తడబడి విడిపోయారు.

వంటవాడి మాటలు నిజమైతే మూడు సంవత్సరాలుగా జరుగుతోం దిది.

నేనెంత వెర్రిదాన్ని?

రోజూ ఒక రాత్రివేళ సుధాకర్ లేచి తన ఆఫీసు ఫైల్సు చూసుకుంటా ననేవాడు. ఇది పెళ్ళయినప్పట్నుంచీ జరుగుతున్న విశేషమే! లంకంత కొంప. అర్ధరాత్రి వేళ ఫైళ్ళు చూసుకుందుకు ప్రత్యేక గది కేంలోటు??

కానీ ఆయన ఫైల్సుకు విమల కూడా జతపడిందని నేను కలలోకూడ ఊహించలేదు.

షాక్‌లోంచి తేరుకునే సరికి అక్కడ విమల లేదు. ఆయన నావైపే చూస్తున్నాడు. నే నోసారి అసహ్యించుకుంటూ ఆయన్ను చూసి పడకగదికి వెళ్ళిపోయాను.

ఆయన న న్ననుసరించి వచ్చాడు.

నన్ను తాకితే విసిరికొట్టా లనుకున్నాను. కానీ ఆయన నన్ను తాకలేదు.

కాసేపటికి వెనుకనించి ఆయన మాటలు వినిపించాయి, "ఈ వ్యవహారం చాలాకాలంగా జరుగుతోంది. నీకు తెలిసే ఊరుకున్నా వనుకున్నాను."

ఆయన ఇలా అంటా డనుకోలేదు. చటుక్కున వెనక్కు తిరిగి, "తెలిసి ఈ విషయంలో ఏ ఆడదైనా ఊరుకుంటుందా?"అన్నాను.

"నా అభిప్రాయంలో అందరు ఆడవాళ్ళూ వేరు, నువ్వు వేరు" అన్నాడు సుధాకర్.

"అంటే?"


"నీకే తెలుసు."

చాలా తెలివైన సమాధానం. నేను ఉక్రోషంగా, "ఇక మీరు దాంతోనే కులకండి. నేను ఎక్కడికైనా వెళ్ళిపోతాను" అన్నాను.

"ఎందుకు?"

ఇంత జరిగినా నిమ్మకు నీరెత్తినట్లు మాట్లాడుతున్న ఆయన్ను చూస్తుంటే మగజాతిమీదే అసహ్యం పుట్టింది. కోపంగా,"ఇంత జరిగాక ఇంకా నే నీ ఇంట్లో ఉంటా ననుకున్నారా?" అన్నాను.

"ఇంత జరిగాక అంటున్నావు - పొరపాటు! ఇది రోజూ జరుగుతూనే ఉంది. అయినా నువ్వీ ఇంట్లో ఉన్నావు. సంతోషంగాకూడా ఉన్నావు. జరిగిందానికి నీ సంతోషం తగ్గలేదు. జరిగింది తెలిస్తేనే నీ సంతోషం మాయమయింది. ఏమీ జరగలే దనుకో. ఇకమీదట అర్ధరాత్రిపూట పడకగది విడిచిరాకు. ఎప్పటిలా సంతోషంగా ఉండు...."




"అంటే మీరు దానితో కులకడం మాన నంటారు...."

"మొధటిరోజునే నువ్వు న్నాపి ఉంటే ఏమో. కానీ ఇప్పుడు అలవాటైపోయింది. విమలను నేను వదులుకోలేను!"

తెల్లబోయాను. నా మెడలో తాళి కట్టిన భర్త, నా చేయి పట్టుకుని నాతి చరామి అని నలుగురి ముందూ ప్రమాణం చేసిన భర్త ఇప్పుడు మరో యువతిని వదల్లేనని నాతో అంటున్నాడు.

"మొదటిరోజే నాకు తెలిసి ఉంటే ఇన్నా ళ్ళూరుకునేదాన్ని కాదు. కానీ నయవంచన బాగా తెలిసిన మీరు రహస్యాన్ని ఇన్నాళ్ళు దాచ గలిగారు."

"ఇది రహస్యంగా ఉంచాలని నే ననుకోలేదు. కన్నబిడ్డకు తల్లివి కాలేని నువ్వు, కట్టుకున్నవాడికి భార్యవూ కాలేక ఈ విషయం తెలిసికూడా ఊరుకున్నా వనుకున్నాను."

"వెధవవని చేసి, నన్ను తప్పు పడతా రేం? నేను మీ కే లోటు చేశాను? అయినా ఆ విమల ఏ విషయంలోనూ నా కాలిగోటికి సరిపోలదు. ఏంచూసి నన్నొదలి దానివెంట పడ్డారు?" అన్నాను.

"వండిపెట్టడానికి వంటవాడు, ఇంటి పనులకు పనిమనిషి, తోటపనులకు తోటమాలి, పక్కలోకి ఆడది, పలకరించడాని కో బాబు! ఈ ఇంట్లో ఉన్నారు. కానీ లంకంత ఈ ఇంట్లో ఇల్లాలు లేకపోవడం ఓ పెద్దలోటు. విమలలో నే నా ఇల్లాలిని చూశాను. ఒక ఆడది ఇల్లాలుగా మాత్రమే మగాణ్ణి ఆకట్టుకోగలదు."

"ఏదో గతిలేనిది కదా అని ఆదరిస్తే నాకే ద్రోహం తలపెడుతుందా! ఆ విమల మిమ్మల్ని ఆకట్టుకుని మిమ్మల్ని నాకు దూరం చేసిం దన్నమాట? దాన్ని వెంటనే....."ఏమనాలో మాటలురాక ఆగిపోయాను.

"ఆమె నిన్ను నాకు దూరం చేయలేదు. ఎందుకంటే ఈ రోజు మమ్మల్నిద్దర్నీ దగ్గరగా చూసేదాక మనిద్దరి మధ్యా దూర మున్నట్లు నీకు తెలియనే లేదు. ఈ ఇంట్లో అందరి అభీష్టానికీ వ్యతిరేకంగా నువ్వే ఆమెను ప్రవేశపెట్టావు. ఆయాగా ఈ ఇంట్లో అడుగుపెట్టిన విమల ఇప్పుడు నీకు సవతి అయింది!"

ఆయ నింకా ఏదో అనబోతుండగా ఆగ్రహం పట్టలేక, "అంటే మీరు దాన్ని పెళ్ళి చేసుకుంటారా?" అన్నాను.

"నీ కిష్టమైతే ఇద్దరూ కలిసి ఉండవచ్చు. ఇష్టం లేకపోతే నీకు విడాకు లివ్వగలను."

"విడాకులా?" ఆ తర్వాత నాకు నోట మాట రాలేదు.

"నీ అందం చూసి మోసపోయి నిన్ను పెళ్ళి చేసుకున్నాను. నా క్కావలసింది అందాల బొమ్మ కాదు. ఇల్లాలు. ఆ ఇల్లాలు విమలే అవుతుంది."

ఏమనాలో తెలియక విమలను నానామాటలూ అని తిట్టాను. నే నూరుకునేదాకా ఆగి," విమల మంచిమనిషి. నువ్వు అప్పగించిన బాధ్యతను శ్రద్ధగా చేసుకుపోనంది తప్ప నా జోలికి రాలేదు. ఆకర్షణ పెరిగిపోయి నే నామె వెంటబడితే నన్ను వారించడానికి అన్ని ప్రయత్నాలూ చేసింది. చివర కామె మంచితనమే నా కామెను లొంగదీసింది. ఇప్పటికీ ఆమె ఈ ఇంట్లో నీతో సమాన స్థానాన్ని కోరడంలేదు" అని ఆగా డాయన.

"ఎలా కోరుతుంది? ఈ ఇంటికి వచ్చేముందు దాని స్థాన మేమిటో దానికి, తెలియదా?" అరిచినట్లే అన్నాను. అందువల్లనే ఏమో నా ప్రశ్న గదిగోడలకు తగిలి ప్రతిధ్వనించింది.

ఈ ఇంటికి వచ్చే ముందు నీ స్థాన మేమిటని గది గోడలననఈ ప్రశ్నిస్తున్నట్లు నాకు తోచింది.

ఆయన మాత్రం నా ప్రశ్నకు బదు లివ్వలేదు.

ఆ రాత్రి మే మిద్దరం నిద్రపోలేదు, మాట్లాడుకోలేదు.

క్రమంగా నా పరిస్థితి నాకు అర్థమవుతోంది.

ఆయన విమలను మరిగాడు. నావంటి సౌందర్యవతిని కాదని విమలను ఎన్నుకున్నాడు.

నేను విడాకు లిస్తే విమలను పెళ్ళి చేసుకుంటాడు. నేను ఒప్పుకుంటే విమలను ఉంచుకుంటాడు.

నా కున్నవి రెండే మార్గాలు....విడాకులు లేదా విమలను నవతిగా భరించడం!

సుధాకర్ విమలను వదలడు. నేనూ తనతో ఉంటానంటే అభ్యంతరం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో అయిన వాళ్ళకు మించి ఎవరు సలహా ఇవ్వగలరు? కానీ నాకు అయిన వాళ్ళందరూ బొత్తిగా లేనివాళ్ళు. మొగుడితో రాజీపడమనీ, బానిసలా బ్రతకమనీ సలహా లిస్తారు వాళ్ళు.

అయినా నేను పుట్టింటికి వెళ్ళాలనుకున్నాను. వా ళ్ళిచ్చే సలహాలకోసం కాదు. నాకూ నా వాళ్ళున్నారని సుధాకర్‌కి తెలియాలి.

ఇంతకాలం వాళ్ళని ఈసడించి సుధాకర్‌కి లోకు వయ్యాను. నా కోసం నా వాళ్ళు ప్రాణాలు కూడా ఇవ్వగలరని ఆయనకు తెలియాలి.

ఎన్నివిధాల ఆలోచించినా నాలో ఏదోలోపముందని మనసు చెబుతోంది. నా అందం చేయలేని పని విమల చేసింది. విమలలో ఉన్నదీ, నాలో లేనిదీ ఏమిటి? అది తెలుసుకునేందుకు కూడా కొంత కాలం పాటు నే నాయనకు దూరంగా ఉండాలి.

మర్నాడు స్నానాలు కాగానే సుధాకర్‌తో,"నేను నా పుట్టింటికి వెడుతున్నాను. విమల ఈ ఇంట్లోంచి వెళ్ళిపోయిందని నాకు కబురు చేయండి. మళ్ళీ వస్తాను" అన్నాను.

మొండికేసిన మగాడి ముందు ఆడది ఎంతగా దిగజారిపోతుంది? ఈ మాట లనడం ద్వారా విమలతో సంబంధం పెట్టుకున్నందుకు సుధాకర్‌ను నేను క్షమించినట్లే అయింది గదా! తప్పు చేశానని ఒప్పుకోని ఆయన్ని - ఆర్థిక స్వాతంత్ర్యం లేని నేను అంతకంటే ఏంచేయగలను?

సుధాకర్ నామాటలు విన్నాడు. ఆయన దూరంగా కూర్చుని బొమ్మలతో ఆడుకుంటున్న బాబువంక చూసి, "బాబూ! అమ్మ ని న్నొదిలి ఊరెళ్ళిపోతుందిట. వద్దని చెప్పమ్మా!" అన్నాడు.

బాబు బొమ్మల దగ్గర్నుంచి చటుక్కున లేచాడు. పరుగెత్తుకుంటూ నా వైపుగా వచ్చాడు. అప్రయత్నంగా నేను చేతులు సాచాను.

బాబు నన్ను దాటాడు. ఇంకా ముందుకి వెళ్లి వంటింట్లోకి పరుగెత్తాడు. అప్పుడే బయటకు వస్తున్న విమల కాళ్ళకు చుట్టుకుని," అమ్మా! న న్నొదిలి ఊరెళ్ళొద్దు. ప్లీజ్!" అన్నాడు.

అమ్మ అనగానే బాబుకు నేను కాక 'విమల' స్ఫురించింది.

నే నా దృశ్యాన్ని నివ్వెరపోయి చూస్తున్నాను. అప్పుడు నాక్కూడా విమలలోనే ఆ ఇంటి ఇల్లాలు కనిపించింది.!

★

# గడి - నుడి - 34

## ఆధారాలు

### అడ్డం

1. భారతంలో ప్రజలతోనే మొదలయ్యే రాజు. [6]
6. దానవీరుని తల్లి... కృష్ణప్రియ? [2]
7. పాతకాలపు ధాన్య కొలమానం. [3]
8. ఇది ఎత్తడ మంటే ఘర్షణకు దిగినట్టే. [2]
11. అర్జునుడు మానవుడా? [3]
12. దుష్టగ్రహంతో పిడుగు. [3]
15. ఉపాయం వంటిదే. [2]
16. తొమ్మిది నిలువులోని వాడే. [3]
18. శాకం... నారతో వాడబడేది. [2]
21. తన క్రింది నలువు తనకు తెలియనిది. [6]


### నిలువు

1. పుట్టుక వంటిది. [2]
2. భూమి... [3]
3. సేనల మధ్య జరిగేది. [2]
4. ఇది చిత్తగిస్తే పనులు చెడిపోతాయి. [3]
5. కోరలలో విషం దాచుకునేది. పామే కదా? [3]
9. పదహారు అడ్డంలోని తన శక్తి తనకు తెలియనివాడు. [3]
10. ఆహారం. [3]
13. ఇతిహాసంలో గొప్ప ఆర్కిటెక్ట్. [3]
14. మరణం తర్వాత ఎదురయ్యే నదిలో సూర్యుడు. [3]
17. ఊళ్లను ముంచెత్తేది. [3]
19. దీన్ని పారేసుకోవడం అంటే తిట్టడం. [2]
20. దేవుడికి భక్తులు చేసేది. [2]

కూర్పు: అరుణమణి

అడ్డం:

నిలువు:



సమాధానాలు మాకు చేరవలసిన ఆఖరు తేదీ 9-10-91.

గడి-నుడి 30కి సమాధానాలు మాకు చేరవలసిన తేదీని 18-9-91 వరకూ పొడిగించినందున ఆ ఫలితాలనూ, గడి-నుడి 31 ఫలితాలనూ వచ్చే సంచికలో ప్రచురిస్తాము

సంపాదకుడు

చిరునామా:
గడి - నుడి
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక
ఎక్స్‌ప్రెస్ సెంటర్
దోమలగూడ
హైదరాబాదు - 500 029

పేరు: ______________________

______________________

ఊరు: ______________________